తిరుపతి - చిత్తూరు

తెలుగు జాతీయ దినపత్రిక

వార్త






# ఎన్నికలకు ముందు...కొత్తవారికి దేవుని సేవాభాగ్యం !



**-ముగ్గురు ఎమ్మెల్యేలకు టిటిడి బోర్డులో అవకాశం -ఐదురోజుల్లో కొలువుదీరనున్న కొత్త సభ్యులు**

తిరుమల,ఆగస్టు 25(ప్రభాతవార్త)ప్రతినిధి: హిందూ ధార్మికసంస్థ టిటిడి ఆలయ పాలన వ్యవహారాలు, వెంకన్న భక్తులకు సేవలందించేందుకు అవసరమైన నూతన ధర్మకర్తలమండలిని ప్రభుత్వం ఏర్పాటుచేసింది. ఈ కొత్త బోర్డులో ముగ్గురు ఎమ్మెల్యేలకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సభ్యులుగా అవకాశం కల్పించారు. మిగిలిన వారంతా కొత్తవారికి ఈ సారి బోర్డులో సేవాభాగ్యం లభించింది. ఎమ్మెల్యే కోటాలో పొన్నాడ వెంకటసతీష్‌కుమార్ (ముమ్మిడివరం), ఉదయభాను సామినేని(జగ్గయ్యపేట), ఎం.తిప్పేస్వామి(మడకశిర), కడపజిల్లా సిద్దవటంకు చెందిన రాష్ట్రనాయీబ్రాహ్మణకార్పొరేషన్ ఛైర్మన్ సిద్దవటం యానాదయ్యతో బాటు తెలంగాణా నుంచి పెనాక శరత్‌చంద్రారెడ్డి,బిఆర్ఎస్ ఎంపి రంజిత్‌కుమార్ సతీమణి గడ్డం సీతారంజిత్‌రెడ్డి,యల్లారెడ్డిగారి సీతారామరెడ్డి(మంత్రాలయం)కిచోటు దక్కింది. గోదావరి జిల్లానుంచి గడిరాజు వెంకటసుబ్బరాజు (ఉంగుటూరు)నెరుసు నాగసత్యం యాదవ్(ఏలూరు),ప్రకాశం జిల్లా నుండి సిద్దారాఘవరావు కుమారుడు శిద్దా వీరవెంకటసుధీర్‌కుమార్,తమిళనాడు నుండి డాక్టర్ ఎస్.శంకర్, కృష్ణమూర్తివైద్యనాధన్, కర్నాటక నుంచి ఆర్‌వి దేశ్‌పాండే, మహారాష్ట్రనుండి అమూల్‌కాలే,సౌరభ్‌బోరా, మిలింద్‌కేశవ్‌నర్వేకర్,రామ్‌రెడ్డి సాముల, బాలసుబ్రమణియన్‌పళనిస్వామి, ఎస్ఆర్ విశ్వనాథరెడ్డిలకు అవకాశం లభించింది. అలాగే మేకా శేషుబాబు, రాంరెడ్డి సాముల, డాక్టర్ కేతన్ దేశాయ్, బాలసుబ్రమణియన్‌పళనిస్వామి, సుదర్శన్‌వేణులకు చోటు కల్పించారు. 24మంది సభ్యులతో తాజాగా ధర్మకర్తలమండలిని ఏర్పాటుచేసింది. ఇదిలా ఉండగా ఎన్నికల ముందు నియామకమైన ఈ బోర్డులో ప్రాధాన్యతలో మనరాష్ట్రానికి,తెలంగాణాకు చెందిన వారితో బాటు తమిళనాడు, మహారాష్ట్ర, కర్నాటక నుంచి పలువురికి ప్రాతినిధ్యం కల్పించారు. వీరిలో డాక్టర్ కేతన్‌దేశాయి గతంలోనూ గుజరాత్ నుంచి టిటిడి బోర్డులో సభ్యుడుగా పనిచేశారు. తిరుపతిలో తుడ ఛైర్మన్ టిటిడి బోర్డులో ఎక్స్‌అఫిషియో సభ్యుడుగా కొనసాగుతారు. అయితే తుడ ఛైర్మన్‌గా ఇప్పటికే చంద్రగిరి ఎమ్మెల్యే డాక్టర్ చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి కుమారుడు చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి నియమితులయ్యారు.

# శాస్త్రోక్తంగా శ్రీ వరలక్ష్మీ వ్రతం

**-భక్తి శ్రద్ధలతో వ్రతం ఆచరించిన మహిళలు**



అమ్మవారికి విశేషంగా పూజలు నిర్వహిస్తున్న అర్చకస్వాములు

తిరుచానూరు, ఆగస్టు 25 ప్రభాతవార్త : తిరుచానూరు శ్రీ పద్మావతి అమ్మవారి ఆలయ ఆస్థాన మండపంలో శుక్రవారం శ్రీ వరలక్ష్మీ వ్రతం వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా వేకువజామున అమ్మవారిని సుప్రభాతం తో మేల్కొల్పి సహస్ర నామార్చన, నిత్యార్చన, మూలవర్లకు, ఉత్సవర్లకు అభిషేకం నిర్వహించారు. ఈ పర్వదినాన అమ్మవారు బంగారుచీరతో విశేష అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. అనంతరం శ్రీ పద్మావతి అమ్మవారి ఉత్సవమూర్తిని ఆస్థాన మండపానికి వేంచేపు చేసి పద్మపీఠం పై ఆశీనులను చేశారు. అక్కడ విష్వక్సేనారాధన, పుణ్యాహావచనం, కలశస్థాపన, అమ్మవారి ఆరాధన, అంగపూజ, లక్ష్మీ సహస్రనామార్చన, అష్టోత్తర శత నామావళి నిర్వహించారు. అమ్మవారిని రోజా, చామంతి, మల్లె, సంపంగి, తులసి, పన్నీరు ఆకు, మరువము, తామరపూలు, వృక్షి వంటి పుష్పాలతో అమ్మవారిని ఆరాధించారు. అమ్మవారిని 9 గ్రంథులలో అలంకరించారు. ఒక్కో గ్రంథిని ఒక్కో దేవతకు గుర్తుగా ఆరాధించారు. భవిష్యత్తర పురాణంలో వ్యాస భగవానుడు వరలక్ష్మీ వ్రతం పూజా విధానాన్ని, మహత్యాన్ని తెలియజేశారని పాంచరాత్ర ఆలయ అర్చకులు శ్రీనివాసన్ తెలిపారు. పూర్వం శంకరుడు, పార్వతిదేవికి ఈ వరలక్ష్మీ వ్రతం విశిష్ఠత, ఆచరించవల్సిన విధానాన్ని తెలియచేసినట్లు పురాణాలు ద్వారా తెలుస్తోందన్నారు. సాక్షాత్తు శ్రీ మహాలక్ష్మీ ప్రీతితో అవతరించిన తిరుచానూరులో వరలక్ష్మీ వ్రతంలో పాల్గొన్న మహిళలకు సత్సంతానం, దీర్ఘమాంగల్య సౌఖ్యం, సిరిసంపదలు, ఆరోగ్యం, కుటుంబ సౌఖ్యం వంటి ఎన్నో మహాఫలాలు కలుగుతాయని పురాణాల ద్వారా తెలుస్తోందన్నారు. అనంతరం 12 రకాల నైవేద్యాలను అమ్మవారికి నివేదించారు. అనంతరం మహా మంగళ హారతితో వరలక్ష్మీ వ్రతం ముగిసింది. టిటిడి ఉద్యానవన విభాగం ఆధ్వర్యంలో ఆస్థాన మండపంలో ఏర్పాటు చేసిన వ్రత మండపం భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. 20 మంది సిబ్బంది, 2 టన్నుల సంప్రదాయ పుష్పాలు, 20 వేల కట్ ఫ్లవర్స్‌తో ఐదు రోజుల పాటు శ్రమించి అమ్మవారి ఆలయం, ఆస్థానమండపం, వ్రత మండపాన్ని సుందరంగా అలంకరించారు. ఇందులో తమలపాకులు, ఆపిల్, ద్రాక్ష, డ్రాగన్ ఫ్రూట్, మొక్కజొన్న, పైనాపిల్ వంటి ఫలాలు, వివిధ సంప్రదాయ పుష్పాలతో వ్రత మండపాన్ని అద్భుతంగా రూపొందించారు. ఈ సందర్భంగా ఛైర్మన్ మీడియాతో మాట్లాడుతూ శ్రీ మహాలక్ష్మీ అవతరించిన దివ్యస్థలం తిరుచానూరులో వరలక్ష్మీ వ్రతం ఆచరించడం ఆనవాయి తీగా వస్తోందన్నారు. వరలక్ష్మీ వ్రతం చేయడం వలన లోకం సుభిక్షంగా ఉంటుందని, అష్ట ఐశ్వర్యాలు, సుఖశాంతులను అమ్మవారు అనుగ్రహిస్తారని తెలిపారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ప్రత్యేక క్యూలైన్లు, అన్నప్రసాదాలు ఇతర ఏర్పాట్లు చేశామన్నారు. వరలక్ష్మీ వ్రతం సందర్భంగా సాయంత్రం 6 గంటలకు అమ్మవారు స్వర్ణరథంపై ఆలయ నాలుగు మాడ వీధుల్లో విహరించి భక్తులకు కటాక్షించారు. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని కర్పూర హారతులు సమర్పించారు. ఈ కార్యక్రమంలో టిటిడి ఛైర్మన్ భూమన కరుణాకర్ రెడ్డి దంపతులు, జేఈవోలు సదాభార్గవి, వీరబ్రహ్మం దంపతులు, తిరుపతి మున్సిపల్ కమిషనర్ హరిత, ఎస్వీబీసీ సిఈవో షణ్ముఖ కుమార్, ఆలయ డిప్యూటీ ఈవో గోవింద రాజన్, ఏవిఎస్‌వో శైలేంద్ర బాబు, ఏఈవో రమేష్, ఆలయ అర్చకులు, ఇతర అధికారులు, విశేష సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

# భక్తిశ్రద్ధలతో వరలక్ష్మీ వ్రతం...పూజలతో పునీతం

శ్రీకాళహస్తి,ఆగస్టు 25 ప్రభాతవార్త : శ్రీకాళహసితలో శ్రావణ మాసం వరలక్ష్మీ వ్రతాన్ని ప్రతి ఏడాది ప్రసన్నవరదరాజస్వామి ఆలయం కళ్యాణ మండపంలో, దీపావళి నోముల్ని ఆలయంలో నిర్వహించటం ప్రత్యేక ఏర్పాట్లు చేయటం ఆనవాయితిగా వస్తుంది. ఆలయ పునర్మిణ కార్యక్రమాలు జరుగుతుండగా వ్రతాన్ని ఆలయానికి సమీపంలోని బ్రహ్మగుడి వద్ద చక్కగా ఏర్పాటు చేసారు. ఆలయ ఛైర్మెన్ అంజూరు తారక శ్రీనివాసులు సూచనలతో ఆలయ ఇఒ కె.వి.సాగర్‌బాబు ఈ ఏడాది చక్కటి ఏర్పాట్లు చేపట్టారు. శ్రీకాళహస్తీశ్వరాయం శ్రావణ శుక్రవారం సందర్భంగా సాముహిక వరలక్ష్మీ వ్రతపూజలు నిర్వహించారు. మహిళలు విశేష సంఖ్యలో హాజరై పూజలు నిర్వహించారు. పట్టణ నలుమూలల నుంచే కాకుండా చుట్టు పక్కల గ్రామాల నుంచి కూడా మహిళా భక్తులు తండోపతండాలుగా తరలి వచ్చారు. గతం కన్నా ఈ ఏడాది బ్రహ్మగుడిలో ఏర్పాటు చేయటంతో మహిళ సంఖ్య బాగా పెరిగింది. శ్రావణ మాసం మహిళలు నియమనిష్టలతో నిర్వహించే వ్రతం 'వరలక్ష్మీ వ్రతం' ఇందుకు ప్రతి ఏడాది శ్రీకాళహస్తీశ్వరాయంలో ప్రత్యేక ఏర్పాట్లు చేయటం ఆనవాయితి. ఇక్కడి కార్యక్రమాల్ని డెప్యూటీ ఇఒ వెంకటసుబ్బయ్య, ఎసి మల్లికార్జున్ ప్రసాద్,ఎఇఒలు లోకేష్‌రెడ్డి,సతీష్‌మాలిక్ పర్యవేణలో టెంపుల్ ఇన్స్పెక్టర్లు, చిన్న ఆలయాల ఇన్‌చార్జిలు నిర్వహించారు. అధికారుల పర్యవేక్షణలో జరిగే కార్యక్రమాలు కాబట్టి మహిళలకు సంబంధించి ఎలాంటి విమర్శలు ఆరోపణలు ఆరోపణలు లేకుండా ఏర్పాట్లును చేపట్టారు. మహిళల సెంటిమెంటుకు సంబంధించి వ్రతం కాబట్టి రెండు రోజులుగా ఇఒ స్వయంగా పర్యవేక్షించారు. చిన్న ఆలయాల ఇన్‌చార్జి నాగభూషణం చక్కటి ఏర్పాట్లు చేపట్టారు. ఓం కార మఠం నుంచి బ్రహ్మగుడి వరకు మామిడి తోరణాలు పూల తోరణాలు, అరటి చెట్లతో ముస్తాబు చేశారు. నిత్యకళ్యాణం పచ్చతోరణం అన్నట్లు అరటి చెట్లతో ముస్తాబు చేశారు. పట్టణంలోని ఇతర ఆలయాల్ని కూడా ముస్తాబు చేశారు. బ్రహ్మగుడి వద్ద ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన వేదికపై అమ్మవారి విగ్రహాన్ని అలంకరించారు.



సాముహిక వరలక్ష్మీ వ్రతాన్ని ఆచరిస్తున్న మహిళా భక్తులు

కలశ స్థాపన గావించారు.వేదపండితులు అ ర్థగిరి వ్రతం మహత్యంను పఠిస్తుండగా సంబంధం గురుకుల్, కరుణాకర్ గురుకుల్,దక్షిణామూర్తి గురుకుల్ శాస్త్రోక్తంగా మహిళలు పూజలు నిర్వహించారు. నోములు నోచుకున్నారు. మహిమా న్వితమైన ఈ వ్రతాన్ని ఆచరించుటకు దేవస్థానం తరఫున ఏర్పాట్ల తో పాటు పలువురు భక్తులు వాయనాల్ని అందించారు. పూజలను ఉదయం 7గంటల నుంచి ప్రారంభించారు. మొదటి విడత పూజల్లో ఇఒ సాగర్‌బాబు దంపతులు, ధర్మకర్తల మండలి ఛైర్మెన్ అంజూరు తారక శ్రీనివాసులు దంపతులు, బియ్యపుపవిత్రారెడ్డి, బియ్యపు వాణి,ధర్మకర్తల మండలి మహిళా సభ్యులు పాల్గొన్నారు.

# నంది వాహనంపై...
# శ్రీ పార్వతి పరమేశ్వరులు



పుత్తూరురూరల్, ఆగస్టు 25 ప్రభాతవార్త: పుత్తూరు పట్టణంలోని శ్రీ ద్రౌపదీదేవి సమేత శ్రీ ధర్మరాజుల స్వామి వార్షిక బ్రహ్మోత్సవాల సందర్భంగా శ్రీ పార్వతీ పరమేశ్వరులు నంది వాహనంపై మంగళ వాయిద్యాలు నడుమ పుర వీధుల్లో ఊరేగించారు. ఈ ఊరేగింపు కార్యక్రమం శ్రీ కామాక్షి అంభికా సమేత శ్రీ సదాశివేశ్వర స్వామి ఆలయం నుంచి ఊరేగింపుగా కార్వేటినగరం రోడ్డు, కాపు వీధి విధిగా బజారు వీధి మీదుగా ఊరేగింపు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఉభయ దాతగా పుత్తూరు మండలం శ్రీ అల్లూరి సీతారామరాజు క్షత్రియ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించారు. అనంతరం అర్జునుడు తపస్సు, పాశుపతాశ్రమం గైకొనుట కార్యక్రమం అర్జునుడు తపస్సుమాను అధిరోహించి భక్తులకు నిమ్మపండు వీబూది, ప్రసాదం ఇచ్చే కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఉభయ దాతగా పుత్తూరు టి.ఉమాపతిరాజు ఆధ్వర్యంలో నిర్వహించారు. అనంతరం ఉదయం శ్రీ రుక్మిణీ సత్యభామ సమేత, శ్రీకృష్ణ సమేత సర్వభూపాల వాహనంపై ఊరేగించారు. ఈ కార్యక్రమానికి ఉభయ దాతగా పుత్తూరు మండలం నాయి బ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో నిర్వహిం చారు. మధ్యాహ్నం 12 గంటలకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమం కుబేదాతగా పుత్తూరు ప్రైవేటు ఎలక్ట్రికల్ వర్కర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించారు. సాయంత్రం 4 గంటలకు గుండ్ల పుత్తూరు వద్ద భూముల్లో ఉత్తర గోగ్రహణం కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పుత్తూరు గ్రామస్థులు వ్యవహరించారు. రైల్వేస్టేషన్ ఆవరణలో పాటకచ్చేరి కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమం ఉభయదాతగా పుత్తూరు రైల్వే ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో నిర్వహించారు. అలాగే 9 గంటలకు వరలక్ష్మిదేవి ద్రౌపదమ్మ విమానం మహోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఉభయదాతగా లారీ బస్సు ఓనరు సంఘం పుత్తూరు లారీ ఓనర్స్ అసోసియేషన్ వర్కర్ల సంఘం ప్రెసిడెంట్, బీసీ ధరణి, వైస్ ప్రెసిడెంట్, వైస్ ప్రెసిడెంట్ జి.సుబ్రహ్మణ్యం నాయుడు ఆధ్వర్యంలో నిర్వహించారు. అర్ధరాత్రిపైన అలుగు ఉత్సవాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఉపయోగ అలుగు ఉత్సవం బలిజ(కాపు) అభ్యుదయ సేవా సమితి ఆధ్వర్యంలో నిర్వహించారు. అనంతరం ఒక గంటకుపైనా కాళికాదేవికి ఇలా వంతుని బలిచ్చే కార్యక్రమం ఉభయ దాతగా పుత్తూరు కుమ్మర యువసేన ఆధ్వర్యంలో నిర్వహించారు. భక్తి పట్టణ గ్రామీణ ప్రాంతాల నుంచఇ అదే సంఘం హాజరయ్యారు. అలాగే పలు వేషధారణలో భక్తులను ఆకట్టుకున్నారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ మోహన్, సభ్యులులు పాల్గొన్నారు.

**నేడు ఆలయంలో...**

ఉదయం శ్రీకృష్ణ రాయబారం, సాయంత్రం రథోత్సవం, అలాగే శ్రీకృష్ణ రథం ఊరేగింపు ఘటోత్కజ వాహనం ఊరేగింపు కార్యక్రమాలు ఉంటాయని తెలిపారు. నంది వాహనంపై శ్రీ పార్వతీపరమేశ్వరులు

# చంద్రయాన్-3తో మొదలైన పరిశోధన

**-భూ కేంద్రాలకు అందుతున్న వీడియోలు, ఫోటోలు**

శ్రీహరి కోట (తడ), ఆగస్టు 25 ప్రభాతవార్త : భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ చంద్రయాన్-3 ప్రయోగం చేపట్టిన తర్వాత అన్నీ విజయాలే సిద్ధిస్తున్నాయి. జాబిల్లి దక్షిణ ధృవం మీద దిగిన మన విక్రమ్ లాండర్, ప్రజ్ఞాన్ రోవర్‌లు తమ పరిశోధనలు మొదలు పెట్టేశాయి. వీటికి చంద్రయాన్-2లో నాలుగేళ్ల క్రితం పంపించిన ఆర్బిటర్ కూడా జత కలిసింది. ప్రస్తుతం చందమామ దృశ్యాలు, అక్కడ తిరిగే మన విక్రమ్, ప్రజ్ఞాన్ దృశ్యాలు భూ కేంద్రాలకు చేరుతున్నాయి. వీటిని ఇస్రో ప్రపంచానికి ప్రసార మాధ్యమాల ద్వారా అందిస్తోంది. ఇప్పటికి విక్రమ్‌లోని 3 ఉపకరణాలు, ప్రజ్ఞాన్‌లోని 2 ఉపకరణాలు పని చేయడం మొదలు పెట్టినట్టు ఇస్రో ప్రకటించింది



జాబిల్లి పై లాండర్ నుండి దిగుతున్న రోవర్

**-2న ఆదిత్య ఎల్ 1 ప్రయోగం**

చంద్రని పై పరిశోధనల అనంతరం ఇస్రో సూర్య పరిశోధనలకు ఆదిత్య ఎల్ 1 ఉపగ్రహాన్ని ప్రయోగిస్తోంది. సెప్టెంబర్ 2వ తేదిన శ్రీహరికోటలోని రెండవ ప్రయోగ వేదిక నుండి పిఎస్ఎల్‌వి సి 57 రాకెట్ ద్వారా ఈ ఉపగ్రహాన్ని ప్రయోగిస్తున్నారు.

## చంద్రబాబు సిఎం కాగానే మరలా...
# అభివృద్ధి పరుగులు

**- ఎమ్మెల్సీ, సమన్వయ కమిటీ ఛైర్మన్ డా॥ కంచర్ల శ్రీకాంత్**

కుప్పం, ఆగస్టు 25 ప్రభాతవార్త :2024లో తెదేపా అధినేత చంద్రబాబు నాయుడు మరలా ముఖ్యమంత్రి కాగానే కుప్పంలో ఆగిపోయిన అభివృద్ధిని పరుగులు పెట్టిస్తామని ఎమ్మెల్సీ, సమన్వయ కమిటీ ఛైర్మన్ డా॥ కంచర్ల శ్రీకాంత్ పేర్కొన్నారు. శుక్రవారం గుడుపల్లెలో జరిగిన బహిరంగసభలో ఆయన ప్రసంగించారు. తెదేపా అధికారంలో రాగానే యువతకు ప్రకటించిన 20లక్షల ఉద్యోగాల్లో భాగంగా కుప్పానికి అత్యధిక పరిశ్రమలు తెచ్చి స్థానిక యువతకు ఉద్యోగావకాశాలు కల్పిస్తామన్నారు. కుప్పం అభివృద్ధి ఎవరి చలవతో జరిగిందో ప్రజలకు తెలుసన్నారు. కుప్పంలో చంద్రబాబుకు లక్ష మెజార్టీ సాధించేందుకు తెలుగుయువత 22 రోజుల పాటు కుప్పం నియోజక వర్గంలో సైకిల్ యాత్ర చేపట్టి విజయవంతంగా పూర్తి చేయడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. మరో పక్క తెలుగు మహిళ విభాగం అధ్వర్యంలో సైతం మహాశక్తి ప్రచారాన్ని గ్రామ గ్రామాన సారె అందించి చేపట్టడం జరుగుతోందన్నారు. తెదేపా అధికారంలో రాగానే ప్రజా సమస్యల పరిష్కారంకు పెద్దపీట వేయడం జరుగుతుందన్నారు. తెదేపా అధికారంలో వస్తే తల్లికి వందనం పథకం పేరిట ప్రతి ఇంట్లో చదివే పిల్లలకు ఒక్కొక్కరికి 15వేలు, 18-59ఏళ్ల మహిళలకు ప్రతినెలా 1500రూ.లు చెల్లిస్తామన్నారు. అలాగే రైతులకు 20వేల సాయం, మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం కల్పిస్తామని అధినేత చంద్రబాబు సూపర్ సిక్స్ పథకాలు ప్రకటించారన్నారు. తెలుగుయువత నేతలు మాట్లాడుతూ ఎమ్మెల్సీ భరత్ హైదరాబాదునుంచి వచ్చి కుప్పానికి లోకల్ ఎలా అవుతారని ప్రశ్నించారు. ఈసందర్భంగా సైకిల్ యాత్రను విజయవంతం చేసిన కోఆర్డినేటర్ సత్యేంద్రశేఖర్, రాష్ట్ర యువత కార్యదర్శి మణి, కుప్పం నియోజకవర్గ అధ్యక్షుడు వెంకటేష్, మండల యువత అధ్యక్షులను ఎమ్మెల్సీ డా॥ కంచర్ల ఘనంగా సత్కరించారు. కార్యక్రమాల్లో తెదేపా ఇన్‌చార్జ్ పిఎస్ మునిరత్నం,రాష్ట్ర నేత డా॥ సురేష్‌బాబు, మాజీ ఎమ్మెల్సీ గౌనివారి శ్రీనివాసులు, కన్వీనర్ ఆర్.చంద్రశేఖర్, సైకిల్ యాత్ర కోఆర్డినేటర్ సత్యేంద్రశేఖర్, నేతలు ఎంఎస్‌రాజు, బాబునాయుడు, బేటప్ప నాయుడు, త్రిలోక్, హేమాంబర గౌడు, రాజ్‌కుమార్, ప్రేమ్‌కుమార్, డా॥ వెంకటేష్, మణి, వెంకటేష్, రాజేం ద్ర,

# వర్షం లోటు .. పంటలకు చేటు..!



ఏండిన పంట పొలాలు

కోట,ఆగస్టు 25 ప్రభాతవార్త : అన్నదాతలు వానల కోసం ఎదురు చూస్తున్నారు. జులైలో జడిపించిన వరుణుడు.. ఆగస్టులో కనుమరుగ య్యాడు, లోటు వర్షపాతం నమోదువడంతో పంటలపై ప్రభావం చూపుతోంది. వానాకాలం ప్రారంభంలో వర్షాలు కోసం ఎదురుచూపులు తప్పడం లేదు. పంటల సాగు పై అన్నదాత అయోమయంలో ఉండగా జులైలో కేవలం రెండు రోజుల్లోనే అత్యధిక వర్షపాతం నమాదైంది.మళ్లీ ఆగస్టు రాగానే వరుణుడు దోబూచులాడుతున్నాడు. రోజులు గడుస్తున్నా సరైన వర్షాల్లేక వేసిన పంటలు ఎదుగుదల లేక అన్నదాతలు నష్టపోతున్నారు. చెందోడు, చంద్రశేఖపురం, గూడలి, ఊనుగుంటపాళెం, చిట్టేడు, కేశవరం, మద్దాలి, తదితర గ్రామాల్లో వరి పంట చివరి ధశలో ఉందిని ఆయా గ్రామాల రైతులు చెబుతున్నారు. బోర్ల కింది సాగు చేసే రైతుల పరిస్ధితి మరింత దారుణంగా తయారైంది. భూగర్భజాలలు ఇంకిపోవడంతో బోరులల్లో నీళ్ల రాక పంటలు నిలువునా ఎండిపోతున్నాయని రైతులు కన్నీటి పర్వతమవుతున్నారు. రోజు ఆకాశంలో మబ్బులు వస్తుడటంతో వర్షం పడుతుందని రైతులు ఆకాశం వైపు ఎదురుచూడటంమే తప్ప చినుక జాడ లేకపొవడంతో రైతులు కుంగిపోతున్నారు.

## ఉక్కపోత.. దోమల మోత



కోట, ఆగస్టు 25 ప్రభాతవార్త : ఒకపక్క అధిక ఉష్ణోగ్రతలతో జనం అల్లాడుతున్నారు. ఉదయం 9 గంటల నుంచే సూర్యులు సుర్రుమనిపి స్తున్నాడు. సాయంత్రం 6 గంటల వరకు వేడి గాలులు వీస్తూనే ఉన్నాయి. ఉష్ణోగ్రతలు, వడగాల్పుల తీవ్రతతో జనం ఇంటి నుంచి బయటకు అడుగుపెట్టేందుకు భయపడుతున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో వేసవి నుంచి ఉపశమనం పొందేందుకు జనం ఏసీలు, ఎయిర్ కూలర్లను ఆశ్రయిస్తున్నారు. విద్యుత్ వినియోగం పెరగడం వల్ల గత రెండురోజుల నుంచి గ్రామీణ ప్రాంతాల్లో అధికారులు అనధికారికంగా కోత విధిస్తున్నారు. క్షేత్రస్థాయిలో పనిచేస్తున్న ఇంజనీర్లకు సైతం ఎలాంటి సమాచారం అందడం లేదు. దీంతో ఫోన్ చేసినా వినియోగదారులకు సరైన సమాధానం ఉండటం లేదని ప్రకాశం కాలనీ చెందిన మట్టి గుంట శ్రీనివాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.. రాత్రి వేళ విద్యుత్ సరఫరాలో కోత విధిస్తుండటంతో పల్లె వాసులు పడుతున్న అవస్థలు వర్ణనాతీతం. బయటకొస్తే దోమల బెడద, ఇంట్లో ఉంటే ఉక్కపోతతో రాత్రి వేళ జనం ఇబ్బందులు పడుతున్నారు. ప్రధానంగా చిన్నపిల్లలు ఉన్న వారు విలవిల్లాడుతున్నారు.

# చిత్తూరు 'తెలుగుదేశం' పరిస్థితి ఏంటీ!

**- ఇప్పటికీ నియామకం కాని నియోజకవర్గ పార్టీ ఇన్‌ఛార్జీ**

**- పొత్తుల్లో భాగంగా చిత్తూరును 'జనసేన'కు కేటాయిస్తారనే ప్రచారం**



చిత్తూరు, ఆగస్టు 25 ప్రభాతవార్త: నెలల వ్యవధిలో ఎన్నికలు సమీపిస్తున్న ప్పటికీ చిత్తూరు అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలో ప్రతిపక్ష తెలుగుదేశం పార్టీ పరిస్థితి అగమ్యగోచరంగా తయారైంది. 2019 అసెంబ్లీ ఎన్నికల్లో చిత్తూరు నియోజకవర్గంలో తెలుగుదేశం పార్టీ ఓటమి చెందడంతో పార్టీ నేతలు, కార్యకర్తల్లో ప్రారంభమైన నిస్తేజం ఇప్పటికీ కొనసాగుతుంది. పార్టీ అధిష్టానం సైతం చిత్తూరు అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలో తెలుగుదేశం పార్టీని బలోపేతం చేయడానికి ఈ నాలుగు సంవత్సరాలుగా ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంతో నాయకులు, కార్యకర్తల్లో నిరాశ ఏర్పడింది. జిల్లా కేంద్రం చిత్తూరులో తెలుగుదేశం పార్టీకి చెందిన రాష్ట్ర, జిల్లా నాయకులు వున్నప్పటికీ వారెవ్వరు చిత్తూరు అసెంబ్లీ నియోజకవర్గంపై ప్రత్యేక దృష్టి కేంద్రీకరించి పార్టీ అభివృద్ధికి కృషి చేయడం లేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. అలాగే గత అసెంబ్లీ ఎన్నికల్లో చిత్తూరు నియోజకవర్గంలో తెలుగుదేశం పార్టీ ఓటమి పాలైన అనంతరం జరిగిన పరిణామాల్లో చిత్తూరు నుండి 'దేశం' అభ్యర్థిగా పోటీ చేసి ఓటమి పాలైన మాజీ ఎమ్మెల్యే ఎఎస్ మనోహర్ పార్టీకి రాజీనామా చేసి రాజకీయాల నుండి నిష్క్రమించారు. అప్పటి వరకు చిత్తూరు నియోజకవర్గ పార్టీ ఇన్‌ఛార్జీగా వ్యవహరించిన మాజీ ఎమ్మెల్యే ఎఎస్ మనోహర్ పార్టీకి రాజీనామా చేయడంతో అప్పటి నుండి ఇప్పటి వరకు పార్టీ అధిష్టానం చిత్తూరు నియోజకవర్గం లో పార్టీని అభివృద్ధి చేసి కార్యకర్తల్లో ఉత్సాహం నింపడానికి నియోజకవర్గ పార్టీ ఇన్‌ఛార్జీగా ఎవరిని నియ మించలేదు. చిత్తూరు అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలో చిత్తూరు మున్సిపల్ కార్పొరేషన్, చిత్తూరు రూరల్ మండలంతో పాటు గుడిపాల మండలాలు వున్నాయి. చిత్తూరు నగర పార్టీ అధ్యక్షురాలిగా మాజీ మేయర్ కఠారి హేమలత, చిత్తూరు రూరల్ మండల అధ్యక్షులుగా శశికర్‌బాబు, గుడిపాల మండల పార్టీ అధ్యక్షులుగా సుబ్రమణ్యం నాయుడులు వున్నారు. వీరు వారి పరిధిలో పార్టీని పటిష్టం చేయడంతో పాటు కార్యకర్తల్లో ఉత్సాహం నింపడానికి ప్రయత్నాలు చేస్తున్నప్పటికీ పై స్థాయి నాయకత్వం నుండి వీరికి సరైన సహకారం వుండటం లేదని పార్టీలోని కొంతమంది నాయకులు పేర్కొంటున్నారు. ఎన్నికలు సమీపిస్తున్న ప్పటికీ పార్టీ అధిష్టానం చిత్తూరు నియోజకవర్గంపై దృష్టి కేంద్రీకరించకపోవడంతో రాజకీయ పొత్తుల్లో భాగంగా చిత్తూరు అసెంబ్లీ స్థానంను తెలుగుదేశం పార్టీ జనసేన పార్టీకి కేటాయిం చడానికి సిద్ధపడిందని దీనితోనే చిత్తూరు నియోజకవర్గంపై పార్టీ అధిష్టానం పెద్దగా ఆసక్తి చూపడం లేదని పార్టీలోని ఓ వర్గం నాయకులు చర్చించుకొంటున్నారు. ఈ మేరకు చిత్తూరు తెలుగుదేశం రాజకీయ తెరపై దివంగత మాజీ ఎంపీ ఆదికేశవులు నాయుడు కుటుంబం రానుండటంతో పార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జీ బాధ్యతలు వారికి అప్పగించాలని పార్టీ అధిష్టానం భావిస్తున్నట్లు పార్టీ నాయకులు పేర్కొంటున్నారు. మరోవైపు మాజీ ఎంపి ఆదికేశవులు నాయుడు కుటుంబ సభ్యులు ఈ సారి జనసేన పార్టీలో చేరి చిత్తూరు నుండి పోటీ చేయడానికి సిద్ధమవుతున్నారని ఈ మేరకు పొత్తుల కేటాయింపులో చిత్తూరు స్థానంను జనసేనకు కేటాయిస్తే ఇక్కడి నుండి మాజీ ఎంపీ డికె ఆదికేశవులు నాయుడు కుటుంబ సభ్యులు పోటీ చేస్తారని ప్రచారం జరుగుతుంది. ఈ పరిస్థితుల్లో తెలుగుదేశం పార్టీ అధిష్టానం ఇప్పటికైనా చిత్తూరు అసెంబ్లీ నియోజకవర్గంపై దృష్టి కేంద్రీకరించాల్సిన అవసరం ఎంతైనా వుంది. ఎన్నికలకు ఎక్కువ సమయం లేకపోవడంతో చిత్తూరులో పార్టీని మరింత క్రియాశీలం చేయడానికి నియోజకవర్గ పార్టీ ఇన్‌ఛార్జీని నియమించి పార్టీని క్షేత్ర స్థాయిలో ముందుకు తీసుకెళ్ళడానికి చర్యలు తీసుకోవాలని కార్యకర్తలు కోరుతున్నారు.

# పంచాయతీ 'వార్డు' ఉప ఎన్నికల్లో వైకాపా హవా

- 6 స్థానాల్లో వైకాపా, ఒక్క స్థానంలో తెలుగుదేశం మద్దతుదారులు విజయం

చిత్తూరు, ఆగస్టు 19 ప్రభాతవార్త: చిత్తూరు జిల్లాలో శనివారం జరిగిన పంచాయతీ వార్డు ఉప ఎన్నికల్లో అధికార వైకాపా మద్దతుదారులు తమ సత్తా చాటారు. జిల్లాలో 7 వార్డులకు ఉప ఎన్నికలు జరుగగా అందులో 6 వార్డు స్థానాలను అధికార వైకాపా మద్దతుదారులు కైవసం చేసుకొంటే ఒక్క వార్డు స్థానంను తెలుగుదేశం మద్దతుదారులు దక్కించుకొన్నారు. ప్రతిపక్షనేత నారా చంద్రబాబునాయుడు ప్రాతినిధ్యం వహిస్తున్న కుప్పం నియోజకవర్గ పరిధిలోని రెండు మండలాల్లో మూడు వార్డు స్థానాలకు పోలింగ్ జరిగితే ఇందులో రెండు వార్డు స్థానాల్లో అధికార వైకాపా మద్దతుదారులు కైవసం చేసుకొంటే ఒక్క వార్డు స్థానంను తెలుగుదేశం మద్దతుదారుడు కైవసం చేసుకొన్నారు. శాంతిపురం మండలంలోని రెండు పంచాయతీల్లో రెండు వార్డు స్థానాలకు ఎన్నికలు జరిగితే ఈ రెండు స్థానాలను అధికార వైకాపా మద్దతుదారులు కైవసం చేసుకొని ప్రతిపక్ష తెలుగుదేశంకు ఖంగుతినిపించారు. శాంతిపురం మండలం మఠం పంచాయతీ 10వ వార్డుకు జరిగిన ఎన్నికల్లో వైకాపా మద్దతుదారుడు రమణప్ప 51 ఓట్లతో తెలుగుదేశం మద్దతుదారుడు సిద్దేష్‌పై విజయం సాధించాడు. ఈ ఎన్నికల్లో రమణప్పకు 127 ఓట్లు రాగా సిద్దేష్‌కు 71 ఓట్లు లభించాయి. అలాగే శాంతిపురం మండలం కడపల్లి పంచాయతీ 10వ వార్డుకు జరిగిన ఎన్నికలల్లో వైకాపా మద్దతుదారుడు సుధాకర్ తెలుగుదేశం మద్దతుదారుడు ప్రకాష్‌పై 40 ఓట్ల మెజార్టీతో విజయం సాధించాడు. ఈ ఎన్నికల్లో సుధాకర్‌కు 142, ప్రకాష్‌కు 103 ఓట్లు లభించాయి. గుడుపల్లి మండలం భజనవాడు పంచాయతీలో జరిగిన ఓ వార్డు ఎన్నికల్లో తెలుగుదేశం మద్దతుదారుడు మంజునాథ్ వైకాపా మద్దతుదారుడు చంద్రప్పపై 64 ఓట్ల మెజార్టీతో విజయం సాధించాడు. ఇక్కడ మంజునాథ్‌కు 144 ఓట్లు, చంద్రప్పకు 80 ఓట్లు లభించాయి. యాదమరి మండలం కాశిరాళ్ళ పంచాయతీలోని ఓ వార్డుకు జరిగిన ఎన్నికల్లో వైకాపా మద్దతుదారుడు రజని ప్రత్యర్థి తెలుగుదేశం మద్దతుదారుడు నందకుమార్‌పై 12 ఓట్ల తేడాతో విజయం సాధించాడు. ఇక్కడ త్రిముఖ పోటీ జరుగడంతో రజనీకి 62, నందకుమార్‌కు 50. గోపికి 7 ఓట్లు లభించాయి. జిడినెల్లూరు మండలం వరత్తూరు పంచాయతీ 2వ వార్డుకు జరిగిన ఎన్నికల్లో వైకాపా మద్దతుదారుడు నాగరాజు టిడిపి మద్దతుదారుడు ముద్దుకృష్ణపై 48 ఓట్ల మెజార్టీతో విజయం సాధించాడు. ఇక్కడ నాగరాజు 141 ఓట్లు సాధించగా ముద్దుకృష్ణ 93 ఓట్లు సాధించాడు. కాణిపాకం పంచాయతీ వార్డు ఎన్నికల్లో వైకాపా మద్దతుదారురాలు మౌనిక ప్రత్యర్థి తెలుగుదేశం మద్దతుదారురాలు కె.సుగుణపై 23 ఓట్ల మెజార్టీతో విజయం సాధించారు. ఇక్కడ మౌనిక 101 ఓట్లు, కె.సుగుణ 78 ఓట్లు సాధించారు. అలాగే వి.కోట మండలం కొంగాటం పంచాయతీ వార్డుకు జరిగిన ఎన్నికల్లో ఇద్దరు వైకాపా మద్దతుదారులే ఎన్నికల్లో పోటీ పడ్డారు. ఇక్కడ వైకాపా రెబల్ అభ్యర్థి వరలక్ష్మి మరో వైకాపా మద్దతుదారురాలు సుజాతపై 122 ఓట్ల మెజార్టీతో విజయం సాధించారు.

## చిత్తూరు డివిజన్

చిత్తూరు, గంగాధరనెల్లూరు, పూతలపట్టు, పలమనేరు, కుప్పం

### ఉప ఎన్నికల్లో మెంబర్‌గా వైసీపి అభ్యర్థి నాగరాజు విజయం

గంగాధరనెల్లూరు, 19 ఆగష్టు ప్రభాతవార్త:



మండలంలోని వరత్తూరు పంచాయతీలో శనివారం నిర్వహించిన ఉప ఎన్నికల్లో రెండో వార్డుకు వైపీపి అభ్యర్థి నాగరాజు టిడిపి అభ్యర్థి ముద్దుకృష్ణపోటీ పడ్డారు రాష్ట్రంలో ఎన్నికలు దగ్గర పడుతుండడంతో ఈ ఎన్నికను ఇరు పార్టీల వారు ఎంతో ప్రతిష్టాత్మకంగా తీసుకొని హోరాహోరీగా పోరాడారు అయితే వైసిపి అభ్యర్థి నాగరాజు టిడిపి అభ్యర్థి ముద్దుకృష్ణపై 48 ఓట్ల మెజారిటిని సాధించినట్లు రిటర్నింగ్ అధికారి అశోక్ బాబు తెలిపారు. విజయం పొందిన నాగరాజుకు పోలింగ్ అధికారులు ఎన్నికల ధ్రువీకరణ పత్రాన్ని అందించారు.

పోటోరైటప్:జిడియన్1: ఎన్నికల ధ్రువీకరణ పత్రాన్ని అందుకుంటున్న నాగరాజు

### వానగుట్టపల్లిలో సైకిల్ యాత్ర



కుప్పంరూరల్, ఆగస్టు 19 ప్రభాతవార్త : మండలంలోని వానగుట్టపల్లిలో శనివారం తెలుగుయువత నేతలు సైకిల్ యాత్ర చేపట్టారు. ఈసందర్భంగా గ్రామంలోని ప్రజలకు తెదేపా అధినేత చంద్రబాబునాయుడు పాలనలో జరిగిన అభివృద్ధిని వివరించారు. వైకాపా పాలనలో అన్ని రకాల సరుకుల ధరలు పెరిగాయని ఆర్టీసీ, గ్యాస్, కరెంట్ చార్జీలు పెంచి పేదల నెత్తిన బాదుతున్నారన్నారు. వచ్చే ఎన్నికల్లో చంద్రబాబును అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమాల్లో యూనిట్ ఇన్‌చార్జ్ రామచంద్ర, మాజీ ఎంపిపి సాంబశివం, జిల్లా నేత రాజగోపాల్, తెలుగుమహిళ కార్యదర్శి స్వాతి, రాష్ట్ర తెలుగుయువత నేత మణి, నియోజకవర్గ అధ్యక్షుడు వెంకటేష్, మండల యువత అధ్యక్షుడు సుబ్బు, నేతలు శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

### గురుశిష్యుల మధ్య గొప్ప అనుబంధం

గుడిపాల, ఆగస్టు 19 ప్రభాతవార్త:

ప్రాచీన కాలంలో గరుశిష్యుల మధ్య వున్న అనుబంధం గొప్పదని విద్యాపీఠ విశ్రాంత ప్రొఫెసర్ డాక్టర్ నాగ త్రిశూలపాని శర్మ పేర్కొన్నారు. మండలంలోని సిఎన్ఆర్ కళాశాలలో శనివారం గురువుకు వందనం కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ప్రొఫెసర్ మాట్లాడుతూ రామాయణ, మహాభారత కాలాల్లో రాముడు, వశిష్టుడు అలాగే అర్జునుడు ద్రోణాచార్యులకు వున్న గురుశిష్య అనుబంధంను ఆయన వివరించారు. ఈ కార్యక్రమంలో కళాశాల కరెస్పాండెంట్ లోకేష్, హెడ్మాస్టర్ శరత్‌చంద్ర, రామచంద్రలు, ఎన్ఎస్ఎస్ అధికారి అర్జున్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

### కొంగాటం వార్డు ఎన్నికల్లో వరలక్ష్మి గెలుపు

వి.కోట, ఆగస్టు 19 ప్రభాతవార్త :



మండలంలోని కొంగాటం పంచాయతీ ఒకటో వార్డుకు జరిగిన ఎన్నికల్లో వరలక్ష్మి గెలిచారు. అధికార పార్టీకి చెందిన ఇద్దరు అభ్యర్థులు బరిలో దిగారు. ఈవార్డులో మొత్తం 545 ఓట్లకు గాను 472 ఓట్లు పోలయ్యాయి. వరలక్ష్మికి 292ఓట్లు రాగా తన ప్రత్యర్థి సుజాతమ్మపై 122 ఓట్లతో గెలిచారని ఎన్నికల అధికారులు తెలిపారు. పోలింగ్ సరళిని పలమనేరు డిఎస్పీ సుధాకర్‌రెడ్డి పర్యవేక్షించారు.

### పి.బి.వాడ పంచాయతీ వార్డులో తెదేపా మద్దతుదారు విజయం

గుడుపల్లె, ఆగస్టు 19 ప్రభాతవార్త :

గుడుపల్లె మండలం పెద్దబదనవాడ పంచాయతీ నాలుగోవార్డు కమ్మగుట్టపల్లి వార్డుకు జరిగిన ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ మద్దతుదారు మంజునాథ్ విజయం సాధించారు. శనివారం నాలుగోవార్డు ఎన్నికను అధికారులు నిర్వహించారు. ఉదయం 7గంటలనుంచి మధ్యాహ్నం 1గంట దాకా ఎన్నికలు జరిగాయి. మధ్యాహ్నం ఓట్ల లెక్కింపు జరిగింది. వార్డులో మొత్తం 224 ఓట్లు పోలయ్యాయి. ఇందులో తెదేపా మద్దతుదారు మంజునాథ్‌కు 144 ఓట్లు రాగా వైకాపా మద్దతుదారు చంద్రప్పకు 80 ఓట్లు పోలయ్యాయి. తెదేపా మద్దతుదారు మంజునాథ్ 64ఓట్ల మెజార్టీతో గెలిచారు. ఈసందరభ్ంగా గుడుపల్లె మండల దేశం నేతలు సంబరాలు జరిపారు.

### ఫోటోగ్రాఫర్లూ కార్మిక బీమా రిజిష్ట్రేషన్ చేసుకోవాలి : చైర్మన్

పుంగనూరు,ఆగస్టు 19 ప్రభాతవార్త :

ఫోటోగ్రాఫర్లు కార్మికబీమా గుర్తింపు పొందాలని మున్సిపల్ ఛైర్మన్ అలీంబాషా అన్నారు. శనివారం ప్రపంచ ఫోటోగ్రఫీ దినోత్సవం సందర్భంగా సిఎస్ఐ కమ్యూనిటీ హాల్‌లో జరిగిన సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ ఫోటోగ్రాఫర్ల సేవలు ప్రశంసనీయమని, పెరిగిన సాంకేతిక విజ్ఞానంతో పోటీ పడుతూ ఫోటోగ్రాఫర్లు కూడా పూర్తిగా డిజిటల్ ఫోటోగ్రఫి వైపు నడుస్తున్నారన్నారు. సీనియర్లు పతి,చంద్రన్న, శేఖర్,నాగరాజులు మాట్లాడుతూ సెల్‌ఫోన్ విప్లవం వచ్చిన తరువాత ఫోటోగ్రఫీ వ్యవస్థ దారుణంగా దెబ్బతినిందని, ఫోటోగ్రాఫర్లకు ప్రభుత్వం ప్రత్యేక పెన్షన్ ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో భాగంగా ఫోటోగ్రాఫర్లకు బీమా విధానాలను తపాలా శాఖ మణిసూచించారు. కార ్యక్రమంలో పట్టణ,గ్రామీణ ప్రాంతాల ఫోటో గ్రాఫర్లు పాల్గొన్నారు.

### పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

పాలసముద్రం, ఆగస్టు 19 ప్రభాతవార్త:

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత అని జన విజ్ఞాన వేదిక జిల్లా కార్యదర్శి సుధాకర్ పేర్కొన్నారు. తిరుమలరాజు పురం జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు శనివారం జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో పాలసముద్రం రహదారి నుండి తిరుమలరాజపురం జడ్పీ ఉన్నత పాఠశాల వరకు రోడ్డుకు ఇరువైపులా మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా జన విజ్ఞాన వేదిక కార్యదర్శి సుధాకర్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరు మొక్కలను నాటడమే కాకుండా వాటిని పెంచి పోషించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు మురుగదాసు, కె.శ్రీనివాసులు, డి.హరిప్రసాద్, వి.నవీన్‌కుమార్, ఎన్ఎస్ఎస్ కో-ఆర్డినేటర్లు, విజయం విద్యా సంస్థల ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

### ఉపాధి కూలీలకు వంద రోజుల పని

పాలసముద్రం, ఆగస్టు 19 ప్రభాతవార్త:

ఉపాధి కూలీలకు వంద రోజుల పని కల్పించడానికి చర్యలు తీసుకోవాలని ఎంపిడిఓ ప్రేమ్‌రాజ్‌కుమార్ పేర్కొన్నారు. ఎంపిడిఓ కార్యాలయంలో శనివారం ఎంపిడిఓ ప్రేమ్‌రాజ్‌కుమార్ ఉపాధి సిబ్బందితో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఎంపిడిఓ మాట్లాడుతూ ఉపాది పనుల్లో కూలీల హాజరు శాతం మరింత పెరిగేలా చర్యలు తీసుకోవాలని ఎపిఓ మార్గరేట్‌ను ఆదేశించారు. తక్కువ పనితీరు వున్న గ్రామాలపై దృష్టి కేంద్రీకరించి అక్కడ ఉపాధి పనుల వేగం పుంజుకొనే విధంగా కృషి చేయాలన్నారు. మండలంలో 110 ఎకరాల్లో మొక్కలు నాటాల్సిందిగా లక్ష్యం నిర్ణయించడంతో బీడు భూములు, కుంటలు, చెరువుల గట్లను ఈ నెలా 30లోపు పూర్తి చేయాలన్నారు. ఇప్పటి వరకు 64 ఎకరాల్లో చెట్లు నాటే కార్యక్రమం పూర్తి కావడంతో మిగిలిన లక్ష్యంను సైతం ఈ పది రోజుల్లో పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సమావేశంలో ఎపిఓ మార్గరేట్, టెక్నికల్ అసిస్టెంట్ అనూష, ఫీల్డ్ అసిస్టెంట్లు, తదితరులు పాల్గొన్నారు.

### గిరిజన గ్రామాల్లో నూతనంగా సిమెంట్ రోడ్లు

**రామకుప్పం, ఆగస్టు 19 ప్రభాతవార్త :** మండలంలోని గిరిజన గ్రామాల్లో ఎమ్మెల్సీ భరత్, జిల్లా కలెక్టర్ సగిలి షన్మోహన్ చొరవతో నూతన ంగా సిమెంట్ రోడ్లు నిర్మిస్తున్నారు. మండలంలోని పెద్ద తాండా పంచాయతీ వీర్నమల పెద్దతండాలో సర్పంచ్ మోహన్ నాయక్ అధ్వర్యంలో శనివారం సిమెంట్ రోడ్ల పనులకు శ్రీకారం చుట్టారు. కొన్నేళ్లుగా గిరిజన గ్రామాల్లో రోడ్లు లేక ప్రజలు ఇబ్బందులు పడేవారని ఈ సమస్యలపై స్పందించి నిధులు మంజూరు చేసిన జిల్లా కలెక్టర్ సగిలి షన్మోహన్, ఎమ్మెల్సీ భరత్‌కు సర్పంచ్ కృతజ్ఞతలు తెలిపారు.

## రెండు వార్డుల్లో వైకాపా మద్దతుదారుల విజయం

శాంతిపురం, ఆగస్టు 19 ప్రభాతవార్త :



శాంతిపురం మండలంలో జరిగిన రెండు పంచాయతీ వార్డు ఎన్నికల్లో అధికార వైకాపా మద్దతుదారులైన అభ్యర్థులు గెలిచారు. మండలంలోని కడపల్లి పంచాయతీ పదో వార్డు, మఠం పంచాయతీ పదో వార్డులకు శనివారం ఎన్నికలు జరిగాయి. ఉదయం 7గంటలనుంచే పోలింగ్ ప్రారంభమైంది. కడపల్లి పదవ వార్డులో వైకాపా మద్దతుదారు సుధాకర్, మఠంలో వైకాపా మద్దతుదారు రమణప్ప గెలిచారు. కడపల్లి వార్డులో మొత్తం 246 ఓట్లు పోల్ కాగా వైకాపా మద్దతుదారు సుధాకర్‌కు 142, తెదేపా మద్దతుదారు ప్రకాష్‌కు 102ఓట్లు పోల్ కాగా వైకాపా మద్దతుదారు 40ఓట్లతో గెలిచారు. మఠం వార్డులో మొత్తం 200ఓట్లు పోల్ కాగా వైకాపా మద్దతుదారు రమణప్పకు 127, తెదేపా మద్దతుదారు సిద్దేష్‌కు 71 ఓట్లు పోలయ్యాయి. వైకాపా మద్దతుదారు 56ఓట్లతో గెలిచారు. కాగా వైకాపా మద్దతుదారులు గెలవడంతో ఎమ్మెల్సీ భరత్, ఎంపి రెడ్డెప్పలు సమక్ష ంలో వైకాపా నేతలు పెద్ద ఎత్తున విజయోత్సవాలు జరిపారు. కార్యక్రమంలో కుప్పం మున్సిపల్ ఛైర్మన్ డా॥ సుధీర్, ఎఎంసి ఛైర్మన్ విద్యాసాగర్, జడ్పీటిసి శ్రీనివాసులు, ఎంపిపి వసుంధర కోదండరెడ్డి, వడ్డెర కార్పోరేషన్ డైరెక్టర్ పెద్దన్న, నేతలు శ్యామరాజు, కృష్ణమూర్తి, బుజ్జి, చెంగప్ప, కేశవులు, చంద్ర, మహాలక్ష్మి, ఎంపిటిసిలు, సర ్పంచులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## గూడూరు డివిజన్

గూడూరు, సూళ్లూరుపేట, వెంకటగిరి నియోజకవర్గాలు

### ఐదు ఓట్లతో గెలుపొందిన మళ్లీ గిరిజ

వాకాడు, ఆగస్టు 19 ప్రభాతవార్త :



గెలుపు గుర్రాల మధ్య నువ్వా నేనా అన్నట్లుగా ఎవరికి వారు ప్రెస్టేజ్‌గా తీసుకున్నారు. ఎట్టకేలకు వైసిపి బలపరచిన అభ్యర్థి మల్లి గిరిజ ఐదు ఓట్లతో గెలుపొందారు. వాకాడు మండలం కొండాపురం గ్రామంలో శనివారం ఏడో వార్డులో జరిగిన వార్డు మెంబర్ ఎన్నికలో వైసిపి సీయిర్ నాయకులు ఏనుగు సుధాకర్ నాయుడు బలపరిచిన అభ్యర్థి మళ్లీ గిరిజ ఐదు ఓట్లతో గెలుపొందారు. 251 బూత్ నెంబరులో 130 ఓట్లు గాను 117 ఓట్లు పోలుగాక వైసిపి పార్టీ అభ్యర్థికి 62 ఓట్లు రాగా, టిడిని బలపరిచిన అభ్యర్థికి 55 ఓట్లు వచ్చాయి. కొండాపురం గ్రామం లోని వైఎస్ఆర్‌సిపి పార్టీ అభ్యర్థి గెలుపొందడంతో బాణ సంచాలతో మారుమోగాయి. రానున్న ఎంపిటిసి ఎన్నికల్లో కూడా వైఎస్ఆర్‌సిపి పార్టీ అభ్యర్థి గెలుపొంది అవకాశాలు ఉన్నాయి. గ్రామ ప్రజలు సుధాకర్ నాయుడును ఎత్తుకొని గ్రామంలో తిరిగారు. 7వ వార్డు అభ్యర్థి ఎం. గిరిజ ఘన విజయం సాధించడంతో గిరిజను ప్రతిపాదించి, బలపరిచి, గెలుపు కోసం కృషి చేసిన వైకాపా నాయకుడు వాకాడు, సొసైటీ వైస్ చైర్మన్‌ఏనుగుసుధాకర్‌నాయుడునుకొండాపురంవైకాపామద్దతుదారులుఘనంగాసన్మానించి,అభినందించారు.

### పరిమళించిన మానవత్వం

కోట, ఆగస్టు 19 ప్రభాతవార్త :



కోటకు చెందిన ఓ వ్యక్తి శనివారం ఉదయం అపస్మారక స్థితిలో పడిపోయాడు. రోడ్డుపై వెళుతున్న వారు చూస్తున్నారే తప్ప ఎలాంటి సహాయ చర్యలు చేపట్టలేదు. అదే మార్గంలో వెళుతున్న ఎంపిటిసి షంషుద్దిన్ రోడ్డుపై పడి ఉన్న వ్యక్తి వద్ద బైక్ ఆపి అతన్ని ఆటోలో తీసుకెళ్లి కోట ప్రభుత్వాసుపత్రిలో చేర్పించి మానవత్వాన్ని చాటుకున్నారు. ఆ మేరకు బాధితుడికి ఆసుపత్రిలో సహాయక చర్యలు చేపట్టారు.

### ఉప పోరులో వైసీపీ విజయం

కోట, ఆగస్టు 19 ప్రభాతవార్త :

కోట మండలం కేశవరం పంచాయతీలో 5వ వార్డుకు శనివారం జరిగిన ఉప ఎన్నిక పోరులో వైసీపీ మద్దతుదారులు పుల్లమ్మ 10 ఓట్ల తేడాతో విజయం సాధించింది. 97 ఓట్లు వైసీపీ మద్దతుతో పోటీ చేసిన పుల్లమ్మకు రాగా, టీడీపీ మద్దతుతో పోటీ చేసిన రేవతికి 87 ఓట్లు వచ్చాయి. దీంతో 10 ఓట్ల తేడాతో పుల్లమ్మ విజయం సాధించినట్లు ఎంపిడిఓ భవాని, ఎన్నికల అధికారి మస్తానయ్య తెలిపారు. కాగా ఈ ఎన్నికను వైసీపీ నాయకులు ఉలవకాయల ప్రసాద్, గురుస్వామి ప్రతిష్టాత్మకంగా తీసుకున్నారు.

### ఓటుకు వెయ్యి నుంచి రూ.1500 పంపిణీ

కోట, ఆగస్టు 19 ప్రభాతవార్త :

కేవలం పంచాయతీ వార్డు సభ్యుని ఎన్నికకు నాయకులు లక్షలు ఖర్చు చేశారు. ఓటర్లకు నగదు అందజేశారు. ఈ వ్యవహారం అంతా కోట మండలం కేశవరం పంచాయతీలో జరిగిన వార్డు ఎన్నికకు అధికార పార్టీ ఒక వర్గం ఒక్కొక్క ఓటుకు వెయ్యి రూపాయలు పంపిణీ చేశారు. తెలుగుదేశం పార్టీ వారు ఒక్కొక్క ఓటుకు రూ.1500 ఇచ్చినట్లు గ్రామంలో చర్చ నడుస్తోంది. ఇటీవల ఈ ఎన్నికలో ఎలాగైనా గెలవాలని మాజీ ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ గ్రామంలో ప్రచారం నిర్వహించినట్లు తెలిసింది.

### సమావేశానికి హాజరు కాని అధికారులకు నోటీసులు : ఎంపీపీ



**బాలాయపల్లి, ఆగస్టు 19, ప్రభాతవార్త:** మండల పరిషత్ సమావేశానికి హాజరు కాని అధికారులకు నోటీసులు జారీ చేస్తామని ఎంపీపీ గూడూరు భాస్క ర్‌రెడ్డి తెలిపారు. శనివారం బాలాయపల్లి స్త్రీశక్తి భవనంలో మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఎంపీపీ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమావేశానికి అధికారులు హాజరు కాకపోతే సభ్యులు చెప్పిన సమస్యలను ఎలా పరిష్కరిస్తారన్నారు. సమావేశానికి హాజరు కాని అధికారులకు నోటీసులు జారీ చేయాలని ఎంపీడీవో రవీందర్‌బాబును ఎంపీపీ ఆదేశించారు. సచివాలయం భవనాలకు వచ్చిన సివమెంటు ఏమైందని, దీనిపై విచారణ చేయాలన్నారు. జగనన్న లేటు పనులు చేసిన వారికి బిల్లులు రాలేదని వారు ఆత్మహత్య చేసుకునే స్థితిలో ఉన్నట్లు ఎంపీపీ ఆందోళన చెందారు. జయంపు గ్రామానికి గతంలో లాగానే ఆర్టీసీ బస్సులు నడపాలని ఎంపీపీ తెలిపారు. ఈ సమావేశంలో గొట్టికాడు ఎంపీపీ వెందోటి సుప్రజ, వెంగమాంబపురం సర్పంచ్ వెంకటసుబ్బయ్య, డిప్యూటీ తహసీల్దారు మస్తానయ్య, ఉప మండల అధ్యక్షురాలు వాన పార్వతి తదితరులు పాల్గొన్నారు.

### సమస్యల పరిష్కారం కోసమే పల్లెబాట :మస్తాన్ యాదవ్

బాలాయపల్లి, ఆగస్టు 19, ప్రభాతవార్త:



గ్రామాల్లో ఉన్న సమస్యలను పరిష్కం రించేందుకు పల్లెబాట కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు డాక్టర్ మస్తాన్ యాదవ్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్, సీనియర్ టీడీపీ నేతల బొలిగర్ల మస్తాన్‌యాదవ్ తెలిపారు. ఆయన మండలంలోని పలు గ్రామాల్లో పర్యటించి సమస్యలు తెలుసుకుని గ్రామస్థులకు ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. గ్రామాల్లో ఉన్న సమస్యలు తెలుసుకుని పరిష్కరించేందుకే తాను పర్యటిస్తున్నట్లు తెలిపారు. 2024 సంవత్సరంలో టీడీపీ అధికారంలోకి వస్తుందన్నారు. ఆయనతో పాటు పలువురు నేతలు ఉన్నారు.

### విదేశాలకు వెళ్లే విద్యార్థులకు విరివిగా రుణాలు ఇవ్వండి

వెంకటగిరి, ఆగస్టు 19 ప్రభాతవార్త:




ఇతర దేశాలకు వెళ్లే విద్యార్థులకు విరివిగా రుణాలు ఇవ్వాలని ఎల్‌డీఎం సుభాష్ బ్యాంకర్లకు సూచించారు. వెంకటగిరి స్త్రీ శక్తి భవనంలో మండల స్థాయి బ్యాంకుల మేనేజర్లతో సమావేశం నిర్వహించారు. విదేశాలకు వెళ్లే విద్యార్థులకు రుణాలు ఇస్తే వారు సద్వినియోగం చేసుకుని సక్రమంగా చెల్లిస్తారని తెలిపారు. రుణాల కోసం వచ్చే వారిని బ్యాంకు చుట్టూ తిప్పకుండా అన్ని డాక్యుమెంట్లు ఉంటే త్వరగా ఇవ్వాలని సూచించారు. ప్రభుత్వం ఇచ్చిన టార్గెట్‌ను బ్యాంకు మేనేజర్లు పూర్తి చేయాలని తెలిపారు. విశ్రాంత ఏజీఎం భాస్కర్‌రెడ్డి, బ్యాంకు మేనేజర్ సురేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

### టీటీడీ చైర్మన్‌కి అభినందనలు తెలిపిన నేదురుమల్లి

వెంకటగిరి, ఆగస్టు 19 ప్రభాతవార్త:



తిరుమల తిరుపతి దేవస్థానం చైర్మన్‌గా రెండోసారి నియమితులైన భూమన కరుణాకర్‌రెడ్డిని కలిసి వైసీపీ జిల్లా అధ్యక్షులు నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి అభినందనలు తెలిపారు. టీటీడీ చైర్మన్‌గా రెండు సార్లు నియమించడం సంతోషకరమన్నారు. దేవుని సేవ చేసే భాగ్యం సీఎం జగన్మోహన్‌రెడ్డి రెండోసారి కల్పించారని, శాలువా కప్పి పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలిపారు. ముందుగా డిప్యూటీ సీఎం నారాయణస్వామితో కలిసి సమీక్ష సమావేశం నిర్వహించారు. అక్టోబర్ విజయదశమి నాటికి టిడ్కో గృహాలను జగనన్న లేఅవుట్‌లో నిర్మించిన ఇళ్లను ప్రారంభిస్తామని తెలిపారు. త్వరగా గృహాలను కూడా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ బాలాజీ తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

### అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు : నేదురుమల్లి

వెంకటగిరి, ఆగస్టు 19 ప్రభాతవార్త:



అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని వైసీపీ జిల్లా అధ్యక్షులు నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. యాతలూరు గ్రామంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఇంటికి నేరుగా సంక్షేమ పథకాలు అందించిన ఘనత సీఎం జగన్మోహన్‌రెడ్డికే దక్కిందన్నారు. ఆయన వెంట నాయకులు శ్రీనివాసులురెడ్డి, నాగయ్య, ఎంపీడీవో విజయలక్ష్మి, తహసీల్దారు పద్మావతి, ఎంఈవో వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

### అటల్ పెన్షన్ యోజనతో ఆర్థిక భరోసా

కోట,ఆగస్టు 19 ప్రభాతవార్త :

అటల్ పెన్షన్ యోజన ( ఏపీవై ) చేరడం ద్వారా ఖతాదారులకు వృద్ధాప్యంలో ఆర్థిక భరోసా ఉంటుందని పోస్టల్ అధికారి నిజాముద్దీన్ చెప్పారు. ఆయన శనివారం విద్యానగర్‌లో మాట్లాడుతూ వయసు 40 నుంచి 60 సంవత్సరాల మధ్య ఉన్న వారిని ఏపీవై చేర్చడం ద్వారా ఆర్థిక భద్రత కల్పిచవచ్చుని తెలిపారు. రాష్ట్రంలో 28 లక్షల మంది ఏపీవై ఖాతాదారులు ఉన్నారని వివరించారు.

### పంచాయతీ పోరులో వైసీపీ అభ్యర్థుల విజయం

వెంకటగిరి, ఆగస్టు 19 ప్రభాతవార్త:



నియోజకవర్గంలోని డక్కిలి మండలంలో శనివారం జరిగిన వార్డు సభ్యుల ఎన్నికల్లో వైసీపీ విజయం దుందుభి మోగించింది. మండలంలోని ఆల్తూరుపాడు, దందవోలు, శ్రీపురం పంచాయతీలో ఏకంగా 3 స్థానాల్లో క్లీన్‌స్వీప్ చేసింది. ముఖ్యంగా ఆల్తూరుపాడు వార్డు ఎన్నికల్లో ఉత్కంఠ నెలకొంది. ఫలితాలు వెలువడే వరకు నువ్వా నేనా అన్న తరహాలో సాగిన కౌంటింగ్‌లో ఆఖరికి వైఎస్ఆర్‌సీపీ బలపరచిన అభ్యర్థి జి.మురళి 5 ఓట్లతో విజయం సాధించడంతో ప్రతిపక్ష టీడీపీ ఖంగు తింది. ఇక శ్రీపురం పంచాయతీలో తొలి నుండి వైఎస్ఆర్‌సీపీ బలపరచిన అభ్యర్థి ఎన్నిక లాంఛనమే ప్రచారం నిజమైంది. వైఎస్ఆర్‌సీపీ బలపరిచన అభ్యర్థి 90 ఓట్ల ఆధిక్యంతో విజయం సాధించారు. ఇక దందవోలు పంచాయతీ వార్డు ఎన్నికల్లో నిడిగంటి బుజ్జమ్మ 14 ఓట్లు ఆధిక్యం సాధించారు. మొత్తం మీద నియోజకవర్గ సమన్వయకర్త నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి మార్కు రాజకీయం డక్కిలి మండలంలో సత్ఫలితాలు ఇచ్చిందని రాజకీయ విశ్లేషకులు చర్చించుకుంటున్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ మస్తాన్‌రెడ్డి, దేవలపల్లి మాజీ సర్పంచ్ మాదమాల లక్ష్మీనారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### పెళ్లకూరులో నా భూమి నాదేశం కార్యక్రమం

పెళ్లకూరు, ఆగస్టు 19 ప్రభాతవార్త :



మండల కేంద్రమైన పెళ్లకూరులో నా భూమి నాదేశం కార్యక్రమాన్ని నిర్వహించారు. శనివారం స్వచ్ఛమైన నీరు, గాలిని భావితరాలకు అందించేందుకు ప్రధానమంత్రి నరేంద్ర మోడీ పిలుపు మేరకు నాభూమి నాదేశం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా సూళ్లూరుపేట నియోజకవర్గ పరిధిలోని ఆరు మండలాల నుంచి నీరు, మట్టిని సేకరిస్తున్నారు. ఈ నేపథ్యంలో పెళ్లకూరులో నీరు, మట్టిని కలశాలలో సేకరించి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం కలశాలను నాయుడుపేటకు తీసుకెళ్లారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి పోలంరెడ్డి శేఖర్‌రెడ్డి, ఎంపిడిఓ సురేష్‌బాబు, గురవయ్య, మోహన్, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

### దిగువమాఘం 4వ వార్డు ఏకగ్రీవం

తవణంపల్లె ఆగస్టు 19 ప్రభాతవార్త:



మండలంలోని దిగువమాఘం గ్రామ పంచాయతీ 4వ కు వార్డుకు శనివారం జరిగిన ఎన్నిక ఏకగ్రీవ మైంది. 4వవార్డు సభ్యులుగా వున్న వాసుదేవనాయుడు మృతి చెందడంతో ఎన్నికల కమీషన్ వార్డు సభ్యుని పదవికోసం నోటీఫికేషన్ జారీ చేసింది. ఈమేరకు 4వార్డు ఎన్నికకు జి.జగ దీష్ అనే వ్యక్తి మాత్రమే నామినేషన్ దాఖలు చేయడంతో ఎన్నిక ఏకగ్రీవ మైంది. ఏకగ్రీవంగా ఎన్నికైన జగదీష్‌కు ఎన్నికల రిటర్నింగ్ అధికారి ధృవీకరణ పత్రాన్ని అందజేశారు.

### కాణిపాకం 5వ వార్డు సభ్యురాలిగా మౌనిక గెలుపు

కాణిపాకం, ఆగస్టు 19 ప్రభాతవార్త:

కాణిపాకం గ్రామ పంచాయతీ 5వ వార్డుకు శనివారం ప్రతిష్టాత్మకంగా జరిగిన ఎన్నికల్లో వైకాపా మద్దతుతో పోటీ చేసిన బి.మౌనిక విజయం సాధించింది. 5వార్డు సభ్యురాలు కళావతి మృతి చెందడంతో ఉప ఎన్నికలకు కమీషన్ నోటిఫికేషన్ జారీ చేసింది. ఈమేరకు వైకాపా మద్దతుతో బి.మౌనిక పోటీ చేయగా, టీడీపీ అభ్యర్థి సుగుణ పోటీ చేశారు. ఈఎన్నికలను అధికార యంత్రాంగం పటిష్ట బందోబస్తు నడుమ శనివారం ఎన్నికల పోలింగ్ నిర్వహించారు. ఇందులో వైకాపా మద్దతుతో పోటీ చేసిన మౌనికకు 102 ఓట్లు రాగా టీడీపీ మద్దతుతో పోటీ చేసిన సుగుణకు 78 ఓట్లు పోలయ్యాయి. దీనితో మౌనిక 23 ఓటుంల మెజారిటీతో గెలుపొందినట్లు ఎన్నికల అధికారులు ప్రకటించి గెలిచిన అభ్యర్థికి డిక్లరేషన్ ఫారంను అందించారు. ఎన్నికల్లో గెలుపొందిన మౌనికను ఎమ్మెల్యే ఎంఎస్‌బాబు, స్థానిక సర్పంచ్ శాంతిసాగర్‌రెడ్డి, కాణిపాకం ఆలయ ఛైర్మన్ మోహన్‌రెడ్డి, ఎంపీపీ చింతం మోహన్‌లు అభినందించారు.

**భారీ విజయోత్సవ ర్యాలీ**

ప్రతిష్టాత్మకంగా జరిగిన 5 వార్డు ఎన్నికల్లో వైకాపా మద్దతుతో పోటీ చేసిన మౌనిక గెలుపొందడంతో వైకాపా నాయకులు కార్యకర్తలు భారీ విజయోత్సవ రా ్యలీ నిర్వహించారు. ఈసందర్భంగా అగరంపల్లె నుండి కాణిపాకం వరకు పలు రకాల వాయిద్యాల నడుమ స్థానిక ఎమ్మెల్యే ఎంఎస్‌బాబు ఆధ్వర్యంలో భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం స్వామివారి దర్శించుకున్నారు. ఈకార్యక్రమంలో కాణిపాకం ఆలయ ఛైర్మన్ మోహన్‌రెడ్డి, మండల వైకాపా కన్వీనర్ బుజ్జిరెడ్డి, స్థానిక సర్పంచ్ శాంతిసాగర్‌రెడ్డి, ఎంపీటీసీ సుధీర్, నాయకులు చిన్నారెడ్డి, కోదండ,రవిప్రసాద్, గోపీనాధన్‌లతో పాటు పలువురు నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

